# గోదావరి వరద సహాయక చర్యలలో అధికార యంత్రాంగపు నిర్లక్ష్యాన్ని ఖండించండి

# వరద సహాయక చర్యలను, పునరావాసంతో ముడిపెట్టిన ప్రభుత్వ తీరును నిరసించండి

2020 ఆగస్టు 10 నుండి ప్రారంభమైన గోదావరి వరదలు 16 వ తేదీ నాటికి తీవ్ర రూపం దాల్చాయి. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలైన పశ్చిమ గోదావరి జిల్లా లోని పోలవరం,వేలేరుపాడు,కుక్కునూరు మండలాల గ్రామాలు,ఇటు తూర్పు గోదావరి జిల్లాలోని దేవీపట్నం, వి.ఆర్.పురం,చింతూరు,కూనవరం,ఎటపాక తదితర మండలాల గ్రామాలు ఈ వరద ప్రమాదానికి గురైనాయి.

గోదావరి నదికి వరదలు కొత్త కాదు.వరదలను దృష్టిలో పెట్టుకొని గతం లోని విధివిధానాల ప్రకారం ప్రభుత్వ అధికారులు వరద ముంపు ప్రాంతాలకు ముందుగా లాంచిలను పంపేవారు. వాటిలో మందులు,వైద్య సిబ్బంది,అధికారులతో ఉండి వరదలలలో ప్రజల రక్షణకు చర్యలు తీసుకొనేవారు. ముందుగానే వరదకి గురయ్యే గ్రామాలకు కిరసనాయలు, టెంట్లు, రేషన్ సామగ్రి పంపి ఉంచేవారు. ఆ ప్రాంతాల ప్రజలు సాగించిన నిరంతర ఆందోళనల ఫలితంగానే పై ఏర్పాట్లు జరిగాయి.కానీ, ఈ సంవత్సరం ఈ రక్షణ చర్యలేవీ లేవు. భద్రాచలం వద్ద 61.5 అడుగులకి వరద చేరేవరకు వరద ప్రాంతాల సెక్టొరల్ అధికారులు నిస్తబ్దులుగా ఉండిపోయారు. అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాలకు తరలిన వారికి మాత్రమే సహాయక చర్యలన్న వైఖరి తీసుకొన్నారు. ఈ పరిస్థితిలో వరదలు ముంచెత్తుతుండగా ఆయా గ్రామాల గిరిజన, గిరిజనేతర ప్రజలు తమకు గల అపార అనుభవంతో స్వచ్ఛందంగా తమకు తాము రక్షణ చర్యలను తీసుకొన్నారు. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లి వారి ఏర్పాట్లను వారు చేసుకొన్నారు. మొత్తం వరద బాధిత ప్రజలలో ప్రభుత్వం ఏర్పరిచిన సహాయక కేంద్రాలకు వెళ్ళినవారు నామమాత్రం అని గమనిస్తే ప్రభుత్వ నిర్లక్ష్యం అర్థమౌతుంది.

రెండు నెలల క్రితమే ఏజెన్సి గిరిజనసంఘం, రైతుకూలి సంఘం వంటి ప్రజా సంఘాలు వరదలు వచ్చే అవకాశం వుంది కనుక ఏజెన్సీ ప్రాంతాలలో ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతాలలో రోడ్లను మరమ్మత్తు చేయాలని, పునరావాస చర్యలను వేగవంతం చేయాలని కోరారు.కానీ ప్రభుత్వం ఈ వైపున తగు చర్యలు చేపట్టలేదు. పైగా నిర్వాసిత ప్రజలు ఆ గ్రామాలలో ఉండకూడదు కనుక వారికి వరద సహాయక చర్యలు చేపట్టరాదన్న వైఖరి తీసుకొన్నట్లు ఇప్పటి చర్యలు తెలియచేస్తున్నాయి. నిరుడు వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన 5 వేల రూపాయిల నష్టపరిహారం ఇప్పుడు దేవీపట్నం తదితర ప్రాంతాల ప్రజలకు పంపకం చేశారంటే అధికారుల నిర్లక్ష్యం అర్థమౌతుంది.

ఇప్పటికైనా నిర్వాసితులందరికీ భూమికి, భూమి, సమగ్ర పునరావాసం కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతాల రోడ్లు పూర్తిగా బాగు చేయాలని, వరదల వల్ల నష్టపోయిన ప్రజలు పునరావాసం పూర్తయ్యే వరకూ, పడిపోయిన ఇండ్లను తిరిగి నిర్మించుకొని గౌరవ ప్రదంగా జీవించడానికి, వ్యవసాయానికి అన్ని రకాల చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.

**ఎస్.ఝాన్సీ**

19/8/2020 **అధ్యక్షులు, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)**

**ఇల్లా రామిరెడ్డి**

**అధ్యక్షులు, ఏజెన్సీ గిరిజన సంఘం(ఆం.ప్ర.)**

౦౦౦